

కథా కౌముది

# నీలవేణి

ప్రసాద్ చాగంటి



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

మాఘమాసం. ఉదయపు ఎండ జరజర పాక్కుంటూ సర్పవరం ఊళ్ళోకి వచ్చింది. నీలవేణి పూల దుకాణం ముందు గుత్తగా పూలు కొనుక్కొనేవాళ్ళతో సందడిగా ఉంది. పెళ్ళిళ్ళ ముహూర్తాల హడావుడంతా అక్కడే చూసిన నీలవేణి మనసు రాయుడి మీదకు మళ్ళింది.

"నీలవేణి! పూలు బేగి ఇయ్యి తల్లి!" అంటూ కొట్టుముందు నిలబడ్డ జనంగోల పెడుతున్నారు. ఏదో గుర్తుకు వచ్చి మనసులో నవ్వు మొగిలి పువ్వులా విచ్చుకుని పెదాల మీదకు వచ్చింది. ఆ మైమరుపులో కాటాలో తక్కువ బరువుకి ఎక్కువ పూలు తూచడం చూసింది రామలక్ష్మి. ఆమె మనసు మనసులో లేదని గ్రహించి...

"అక్కో! ఒళ్ళు తెలవడం లేదేటి?" అని గట్టిగా అనేసరికి

నీలవేణి సిగ్గుపడిపోయి, చేత్తో పూలు తగ్గించింది. సర్పవరం ఊళ్ళో నీలవేణి పూల దుకాణానికి చాలా గిరాకీ. ఆమెకున్న ఎకరంనేలలో వేసిన అన్ని రకాల పూల మొక్కలు ఆమె చేయి పడగానే విరివిగా విరబూస్తాయి. ఏ రకం పూలయినా ఈ అమ్మి దగ్గర ఉంటాయి అని జనం ఆమె దగ్గరకే వస్తారు.

పదేళ్ళ వయసులో రాయుడు ఎదురు కొట్టు నాంచారమ్మకి భావనారాయణ స్వామి ఉత్సవాల్లో దొరికాడు. అతన్ని చేరదీసి అన్నం పెట్టి తన దగ్గరుంచేసుకుంది. కొడుకు, కోడలు ఒక పూల కొట్టు చూసుకుంటే, పూల తోటలో పనులతో పాటు సర్పవరం జంక్షన్ దగ్గర పూలమ్మడం లాంటివి అతనితో చేయించుకునేది పూలు కూడా చాలా జాగ్రత్తగా మంచి

పూలు, గడ్డి పూలు వేరు చేసి ఆ నాణ్యంకి సరిపడా ధర నిర్ణయించి అమ్మకానికి పెట్టేవాడు. నాంచారమ్మ, నీలవేణి తోటలు పక్క పక్కనే వుండడం వల్ల, చిన్నప్పుడు ఇద్దరూ తోటల్లో ఆడుకునే వాళ్ళు. నీలవేణి గల గల మాట్లాడుతుంటే, రాయుడు ఆసక్తిగా వినేవాడు తప్ప ఎక్కువ మాట్లాడేవాడు కాదు. ఒక రోజు రామలక్ష్మి చెప్పేవరకు తన శరీరానికి వయసొచ్చిందని, జీవితానికి ఒక తోడు కావాలని గాని అనిపించలేదు.

“ఎంతకాలం ఇలా పెళ్లి సేసు కోకుండా ఉంటావు అక్క. ఎప్పటి దానివి నువ్వు? మరీ ఆలీసం అయితే పోతు బొబ్బాసి సెట్టు కి మనకి తేడా వుండదు తొరగా మంచోడిని సూసి పెళ్లి సేసుకో” నీలవేణికి సలహా ఇచ్చింది రామలక్ష్మి.

“ఈ నల్లదాన్ని ఎవరు సేసుకుంటారే లచ్మీ! నాకు పెళ్లి సంబందాలు సూసేవాళ్ళెవరు? నాన్నా అమ్మా? ఆ యిద్దరినీ మింగిన ఆ బావనారాయణ సామేఏదోటి సెయ్యాల!’’అని చీర చెంగు తో కళ్ళు వత్తుకుంది.

“నలుపు నాణెం. నువ్వు కళగా ఉంటావు. నాగు పాములాంటి నీ పేద్దజడ మన వూళ్ళో ఆడంగులెవరికీ లేదు తెలుసా. నువ్వుఆలోసించాలి గాని,నేనొకటి సెప్పుతాను తిట్టకు మరి”అంది.

“ఏంటే అది? సెప్పు! ఏవనన్లే !”. భరోసా ఇచ్చింది నీలవేణి.

“మన రాయుడుకేం తక్కువ ? ఆడు అందరి మగాళ్లలా పొద్దు తిరుగుడు పువ్వులాంటోడు కాదు. నికార్సయిన కొబ్బరిసెట్టు లాంటోడు. ఏ తిరుగుళ్ళు లేవు. నీలాగే నా అనే వోళ్ళుఎవ్వరులేరు కదా పాపం! ఆణ్ణి సేసుకో నీకో తోడు దొరికినట్టుంటాది . అని ఆశల పల్లకి ఎక్కించింది.

రామలక్ష్మి ఆ మాట చెప్పినప్పటి నుంచి రాయుడిని పెళ్లి చేసుకోవాలనే ఆశ చిగురించింది. క్రమేపీ అతను తనకి కాబోయే మొగుడు అనే దృష్టితో చూడడం మొదలు పెట్టింది. ఆరడుగుల రాయుడు రోడ్డు మధ్యలో నిలబడితే అబ్బా ఏం ఠీవి. అనుకునేది. హీరో హోండా స్టార్ట్ చేసి వెడుతుంటే `అబ్బా ! ఏం స్టైలు` అని మురిసిపోయేది. సాయంకాలం తోటలో అల్లిబిల్లిగా అల్లుకున్న జాజి తీగను చూసి,అచ్చు రాయుడి గిరజాల జుట్టులా ఉంది అనుకుంటూ ఆప్యాయంగా తడిమేది. రాయుడు తన ఊహల్లోకి చొచ్చుకు వచ్చాక పూల సుగంధం మరింత గుబాళించినట్టుగా అనిపించేది ఆమెకు ఆమెకి తన శరీరం మీద శ్రద్ధ బాగా పెరిగింది రోజుకి మూడు సార్లు స్నానం చేయడం, హమామ్ సబ్బుతో ముఖాన్ని నాలుగు సార్లు రుద్దుకోవడం మొదలుపెట్టింది. ఆరు మూరల బొండు మల్లెల దండ తలలో రోజూ పెట్టుకోవడం చూసిన రామలక్ష్మి.

“ఏంటక్కోయ్! తోటలో ఉన్న మల్లె పూవులన్నీ నువ్వే పెట్టేసుకుంటన్నావు! అమ్మకానికి లేవా?” అని పరిహాసమాడడం మొదలుపెట్టింది.“ఊరుకోవే !” అంటూ సిగ్గుల మొగ్గయింది నీలవేణి. ఎలాగైనా రాయుడిని తనవాడిగా చేసుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టింది

★★★★

రెండ్రోజుల్లో రాబోయే మాఘ పౌర్ణమి నాడు సముద్ర స్నానం చేస్తే మంచిదని గుళ్ళో పూజారి గారు చెప్పడం వింది నీలవేణి.

“రాయుడు ! ఎల్లుండి తెల్లారగట్ట సముద్ర తానం సేసి ఉపోసం ఉండాలంట. కాత నన్ను సముద్ర తానానికి ఉప్పాడ తీసుకెడతావా?”. నెమ్మదిగా అడిగింది.

“ అమ్మో ! ఆ రోజు పూలకి మాంచి బేరాలొత్తాయి.మరీ ఆలీసం అయితే అమ్మ తిడతాది.’’ నసిగాడు.

“బెగీ ఎల్లొచ్చాద్దారి! నాక్కూడా పూల గిరాకీ ఉంటాది కదా?” అని అతని మొహం లోకి చూసింది.

“సర్లే ! తెల్లారగట్ట మూడున్నరకే సిద్దంగా ఉండు వేణి! అంటూ పనిలోపడిపోయాడు

మోటార్ సైకిలు మీద ఎక్కుతున్నప్పుడు ఆసరాగా అతని భుజం మీద చెయ్యి వేసింది సిగ్గు వల్ల అతని వెనకాల కూర్చున్నప్పుడు, కాస్త దూరంగా కూర్చుంది కానీ గతుకుల్లో అతని భుజం పట్టుకోక తప్పలేదు జాగర్త! వేణి! అంటూ అతను జాగ్రత్తలు చెప్తుంటే, ఒక మొగుడు , పెళ్ళాం మీద చూపించే శ్రద్ధలా అనిపించి మురిసిపోయింది. సముద్ర స్నానం చేసి ఇద్దరు బట్టలు మార్చుకోడానికి,సర్వి చెట్ల దాపుకి వెళ్లారు ముందు రాయుడు గబ గబ మార్చుకుని, ఆమె మార్చుకుంటుంటే, తన దగ్గర వున్న పంచె రెండు చెట్లకి అడ్డంగా కట్టి,

“ఇక్కడ మార్చుకో వేణి! ఎవరు ఈ పక్కకి రాకుండా సూత్తాను.” అంటూ కొంచెం దూరంగా నిలబడ్డాడు.అతను తనమీద చూపించే శ్రద్ధకి ఆనందపడింది. “ ఇక ఎడదామా ?” అడిగాడు రాయుడు.

తన మనసులోని మాట చెప్పెద్దామని “కాసేపు ఉందారి”. అంది. ఇద్దరు పొడి ఇసకలో కూర్చున్నారు ఉప్పాడ సముద్రం ఆమె హృదయం లాగే ఎగిసెగిసి పడుతోంది.. వెలుగురేఖలు బంతిపూల రంగులో విచ్చుకుంటున్నాయి. అక్కడక్కడ పక్షులు సముద్రం మీద ఎగురుతున్నాయి

“ రాయుడు! ఎప్పటినుండో అడుగుదామని అనుకుంటున్నాను. ఆడదాన్ని సిగ్గు లేకుండా ఇలా అడుగుతున్నాని ఏమి అనుకో వద్దు మరి’’ అంది మంద్రస్థాయిలో. అర్థం అవ్వక ఏంటీ? అన్నట్టు చూశాడు.

“మరి మరి అంటూ నసుగుతోంది నీలవేణి ఆమె నస చూసి, ‘‘ఏంటి వేణి ! బేగి సెప్పు’’ అన్నాడు విసుగ్గా, సెల్ లో టైమ్ చూసుకుంటూ.

“నన్ను పెళ్లి సేసుకుంటావా?”కంగారు కంగారుగా అడిగేసింది

“ఆ పెళ్ళా!” అంటూ కాసేపు మౌనం వహించాడు రాయుడు.

“ఇప్పటివరకు అసలు ఆ ఆలోచనే రాలేదు వేణి” అంటూ బుర్ర గోక్కున్నాడు.

“ఇంతకీ నేనంటే ఇట్టమేనా?’’ పమిటి కొంగు వేలికి చుట్టుకుంటూ అడిగింది సందేహంగా.

“నువ్వంటే ఇట్టమే ”. కానీ నేను ఊరు పేరు లేని అనాధను ఒక్క పైసా సొమ్ము లేదు, ఒక్క సెంటు బూమి లేదు రేపన్నాడు పెళ్లి సేసూకుంటే నీ పుత్తెల కి ఈసమెత్తు బంగారం కూడా పెట్ట లేనివాణ్ణి” అంటూ విచారంగా ఆమె కళ్ళల్లోకి చూశాడు.

“అయ్యో! నాకు మటుకు ఎవరున్నారు?అటువంటి ఆలోసనలు ఏం పెట్టుకోకు. నాకు నువ్వు ఏం పెట్టక్కర్లేదు” మా యమ్మ అన్నీ సేయించి పెట్టింది.నువ్వు ఊ అంటే సాలు నాకు అంది జాలిగా అతన్ని చూస్తూ.

“అదొకటే కాదు వేణి ! యాపారం సేసి బాగా డబ్బు సంపాదించి అప్పుడు పెళ్లి గురించి ఆలోసిద్దామని అనుకున్నాను చెప్పాడు.

“మళ్ళీ ఇంకో యాపారం ఎందుకు.? నాకున్న అనబోయి,మనకి ఉన్న నేలలోనే ఏడాది పొడుగునా పూసే పూల మొక్కలు ఏద్దాము. నాదగ్గర దాసుకున్న డబ్బు శానా వుంది ఇంకా కట్టపడి మరి కాంత బూమి కవులికి తీసుకుందారి. అని గబ గబగా చెప్పింది అతను ఎక్కడ జారిపోతాడో, అన్నఆలోచనతో.

“ఈ పూల యాపారంలో బేగీ పైకి రావడం శానా కట్టం వేణి. నాకు శానా ఆలోసనలు వున్నాయి. అయ్యి. ఎంతవరకూ ముందుకెడతాయో సూడనీ,ఆ తర్వాత ఆలోసిద్దారి అంటూ ఆమె చెయ్యి పట్టుకు లేపాడు. అతని హస్త స్పర్శ కి ఆమె మేనంతా పులకించి పోయింది ఇద్దరు సర్పవరం దారిపట్టారు.

★★★

డబ్ డబ్ మని సౌండ్ చేసుకుంటూ హీరో హోండా రాగానే రాయుడికి ఎదురెళ్ళి,భుజం మీద చెయ్యేసి ముందు వాకిట్లో అరుగుమీద కూర్చోబెట్టాడు తాతబ్బాయి. ఆరుబయట ఎండలో ఆరబెట్టిన మామిడి తాండ్ర పొరలు చూసిన రాయుడు కళ్ళకి అవి ఫెళ ఫెళ లాడే కరెన్సీ నోట్లులా కనబడ్డాయి. `పూలమ్మిన చోట బంగారం రంగున్న ఈ మామిడి తాండ్ర పొరలు మంచి రేటుకు అమ్మాలి, బాగా సంపాదించాలి, జీవితం లో స్థిరపడాలి. అనుకున్నాడు.

“ఇప్పుడు సెప్పు అల్లుడు! ఆ మధ్య కలిసినప్పుడు యాపారం బాగా పెరగడానికి ఏదో ఉపాయం ఉందన్నావు?అంటూ భుజం మీద చెయ్యేసి అడిగాడు తాతబ్బాయి.

“సూడు మావ! నువ్వు పులస సేపలాంటి ఖరీదైన సరుకెట్టుకుని ఈ సర్పారంలో చిల్లరగా అమ్ముకుంటూ పిత్తపరిగ లాంటి లాభంతో సర్దుకు పోవడం నాకేం నచ్చలేదు బంగారం లాంటి ఈ సరుకుని అన్ని రాష్ట్రాలకి ఎగుమతి సేసి బోల్డు డబ్బు సంపాదించొచ్చు. అది కాక, మంచి కాలిటీ సరుకుకి,మన ఎండు అరిటాకుతో ప్యాక్ చేయించి అమెజాన్ లో కూడా పెట్టించి అమ్ముదారి. బోల్డు మంది ఈ రోజుల్లో ఇలా కొత్త తరహాలో సేత్తన్నారు, మనమే ఆలస్యమై పోయాం. అని అతనికి తెలిసిన వ్యాపార కిటుకులు చెప్పడం మొదలుపెట్టాడు.

`ఇన్నాళ్ళూ మావిడి పళ్ల గుజ్జు అడుగంటా పిండి, ఆరబోయడం తెలుసు గాని, లాబాలు కూడా అలాగే పిండొచ్చని తెలవక ఎంతో లాసయిపోయాననుకున్నాడు తాతబ్బాయి.

“నీకు తెలుసు కద మావా ! నాకంటూ ఇడిగా ఏ యాపారము లేదు. మా నాంచారమ్మ పూల యాపారం పెద్ద ఇంపుగాలేదు నీకు సాయం సేత్తా ! కట్టబడతా! నీకు తోసింది కొంత వాటా నాకు కూడా ఇయ్యి అంటూ అతని మొహంలోకి చూశాడు.

తాతబ్బాయి మట్టగిడశ లాంటి వాడు ఇట్టే జారిపోతాడు అంత త్వరగా దొరకడు. `ఈడు పెట్టుబడే పెట్టకుండా వాటా అడుగుతున్నాడేటి?’ అనుకుని,

“నువ్వు సెప్పేది బానే ఉందల్లుడు! కానీ ఈ పళంగా పెద్దగా యాపారం సేయాలంటే నా దగ్గరున్నది సరిపోదు. నువ్వు కూడా కాతతెత్తే మొదలెడదారి. మొదటి ఇడత లాభాలు వచ్చేకా వాటా సంగతి సూద్దారి అప్పటి దాకా నెలవారి జీతం తీసుకో” అంటూ తేల్చాడు.

పెట్టుబడి అనే సరికి రాయిలా అయిపోయిన రాయుడ్ని కుదిపి, వీలుంటే తీసుకురా! ఎక్కువ ఆలోసించక బేగి అట్టుకొచ్చేయి,మొదలెట్టేద్దారి. లేదంటే వదిలేద్దాం అంటూ రాయుడు చెయ్యి నెమ్మదిగా నొక్కాడు. అప్పుడే కొబ్బరి చెట్టు మీద నుంచి కొబ్బరి పువ్వు ఇద్దరి మధ్యలో పడింది.

‘సుసేవా ఎంత శుబమో అని పైకి చూసి నవ్వాడు. ఇద్దరు మాట్లాడుకుంటుండగా తాతబ్బాయి ఇంటి తలుపుల. వెనకాల నుండి పరికిణి అంచులు కనబడ్డాయి రాయుడికి. రెండు కళ్ళు తన్ని చూస్తున్నాయి అనిపించిందతనికి.కాస్త తేరిపార తలుపు కేసే చూస్తూ ఉండిపోయిన రాయుడిని గమనించిన తాతబ్బాయి అతణ్ణి తట్టి, ‘‘యెల్లి రా మరి” అన్నాడు.

“సర్లే! వత్తాను అంటూ తాతబ్బాయి ఇచ్చిన మావిడి తాండ్ర పోర నోట్లో పెట్టుకుని చప్పరిస్తూ హోండా మీద వెళ్ళిపోయాడు. ఆ రాత్రి రాయుడికి నిద్ర పట్టలేదు. తలువు వెనక ఉన్న ఆడపిల్ల తాతబ్బాయి కూతురు అయ్యివుంటుంది. నన్ను అల్లుడు అల్లుడు అని వరస కలిపాడంటే, నా పనితనం సూసి పిల్లనిత్తాడేమో,నా బతుకు బంగారం అయిపోదూ? ఆశ అనే తలంపు సర్పంలా తలెత్తింది రాయుడి మనసులో.

★★★★

పూల తోటలో బంతి నారు తీసి గట్టు మీద పెట్టి అక్కడే కూర్చుని ఆలోచిస్తోంది నీలవేణి. పూల మొక్కల మీద సీతాకోక చిలకలు, తూనీగలు తచ్చాడుతున్నాయి. అడుగుల చప్పుడు వినబడి పక్కకి తిరిగింది ఎవరా అని. రాయుడు నిలబడి ఉన్నా డు. అతను హఠాత్తుగా రావడంతో నీలవేణికి కంగారు వచ్చి చెమటలు పట్టి, అతన్నే చూస్తూ అలాగే ఉండిపోయింది

“వేణి! నీతో కాస్త పనిబడి వచ్చా”అన్నాడు ఉపోద్ఘాతంగా.

“కుడి కాలి బొటన వేలితో నేల మీద రాస్తూ, సెప్పు!” అంది నెమ్మదిగా.

“ఏం లేదు వేణి! నేను మొన్న చెప్పాను కదా,కొత్త యాపారం మొదలెడతానని. అందుకనే మన ఊర్లో ఉన్న మావిడితాండ్ర తాతబ్బాయి దగ్గర జారతన్నాను. పెట్టుబడికి కొంత డబ్బు అవసరం పడింది అంటూ. ఎంత కావాలో చెప్పాడు ఆమె అడిగేలోపే ఆరు నెలల్లో తిరిగి ఇచ్చేత్తాను. అని ఆమె మొహంలోకి చూశాడు.

“అదేం మాట! మన డబ్బులు నీ దగ్గరుంటే ఒకటి నా దగ్గరుంటే ఒకటీనా?అంటూ ఇంట్లోకి దారి తీసి ట్రంక్ పెట్టిలోంచి డబ్బు తీసి అతని చేతిలోపెట్టింది. అతను కనుమరుగు అయ్యే దాకా చూసి ఇంట్లోకి నడిచింది.

వేసవికాలం సీజన్లో మామిడి పళ్ళ రసం తీసి నిలవ చేసి, పొరలుగా ఆరబెట్టి ఏడాది పొడుగునా మామిడి తాండ్ర అమ్మడం, అన్ని రాష్ట్రాలకి పెద్ద బేళ్లతో ఎగుమతి చేయడం,అమెజాన్ ఆర్డర్స్ వలన ఎప్పుడూ చూడని లాభాలు కళ్ల చూసే సరికి తాతబ్బాయి ఆనందంతో ఉప్పాడ సముద్రంలా పొంగిపోయాడు. రాయుడుకి ఉన్న తెలివివల్ల తాతబ్బాయి దేశవాళి మావిడి తాండ్ర `తాతబ్బాయి మ్యాంగో జెల్లీ`గా పిలవబడింది. చిల్లర వ్యాపారస్తులు కూడా తాతబ్బాయి మీద ఆధారపడడం మొదలు పెట్టారు. అనుకోని లాభాలకి, రాయుడు వాటా అడుగుతాడనే ఆలోచన చేపముల్లులా గుచ్చుకోవడం మొదలు పెట్టింది తాతబ్బాయికి. ఒక రోజు రాయుడి చేతిలో నెల జీతం పెట్టాడు. రాయుడు తెల్ల మొహం వేశాడు. అడగలేక అడగలేక అడుగుతూ

“ అదేంటి మావా! నేను కూడా వాటా పెట్టాను కదా! లాభం పంచకుండా, జీతం ఇత్తన్నావేటి?” అంటూ నసిగాడు.

“ఇప్పుడే కదరా అల్లుడు! లాబాలు వత్తన్నాయి. కొంత కాలం ఆగు. దీన్ని మళ్ళీ పెట్టుబడిగా పెట్టి, మరింతగా పెంచుదారి యాపారం”అని మాట దాటేశాడు ఒక రోజు,తాతబ్బాయి ఇంట్లో లేనప్పుడు చావిట్లో తచ్చాడుతున్న ఒక పిల్లని చూశాడు. కళ్ళు తిప్పులేకపోయాడు. ఆ పిల్ల కూడా కిసుక్కున నవ్వి ‘‘నాన్న లేడు ’’ అంటూ అక్కడనుండి పారిపోయింది ఎంత అందంగా ఉంది? అనుకున్నాడు. హఠాత్తుగా నీలవేణి గుర్తుకు వచ్చింది. ఈ పిల్ల ముద్దబంతిలా ఉంది. నీలవేణి గడ్డి పువ్వులా వుంటుంది. ఈమె సన్నజాజి తీగలా నాజూకుగా ఉంది. నీలవేణి తుమ్మచెట్టు కొమ్మలా మొరటు అనుకున్నాడు. `అయినా నీలవేణే నా ఎంట పడింది గాని,నేనేం ప్రేమించలేదే. దాని అవసరం కొద్ది నా దగ్గరకు వచ్చింది.ఈ యాపారం బాగా పెరిగి నాలుగు డబ్బులు సేతిలో పడగానే దాని డబ్బులు దానికి ఇచ్చి పడేత్తాను`అన్న ఆలోచన మొక్కపచ్చపురుగులా మెదళ్ళో దూరింది.

రాయుడు రాత్రనక పగలనక పనిలో పడిపోయాడు. ఒక పక్క తాతబ్బాయి కూతురితో చనువు పెంచుకున్నాడు. నాంచారమ్మని చూడడానికి కూడా చుట్టపుచూపుగా ఇంటికి వస్తున్నాడు.నీలవేణి ఎన్నో సార్లు మాట్లాడదామని ప్రయత్నించినా,ఆమెకి ఆ అవకాశం ఇవ్వలేదు పట్టించుకోవడం మానేశాడు. ఒక సారి మహారాష్ట్ర వెళ్ళిన రాయుడు ఎన్ని రోజులైనా తిరిగి రాలేదని కంగారొచ్చి నాంచారమ్మ కొడుకు చేత రాయుడి కి ఫోన్ చేయించింది. “ఆడి ఫోన్ స్విచ్ ఆఫ్ అని వత్తందే! అంటూ విసుక్కున్నాడు. నాంచారమ్మ తాతబ్బాయి ఇంటికి వెళ్ళి నిలదీసింది. “ఆణ్ణి డబ్బులు వసూలు చేసుకు రాడానికి బయటకి పంపానే”, వత్తాడు! కంగారేంటి?అని సర్ది చెప్పి పంపేశాడు.

★★★★

వానాకాలం వచ్చింది గాని రాయుడు రాలేదు. సర్పవరమంతా రకరకాలు మాటాడుకుంటోంది. రాయుడు తాతబ్బాయికి ఇవ్వవలసిన డబ్బులు పట్టుకుని పారిపోయాడని అంటూ. తాతబ్బాయి ఇచ్చిన కంప్లయింట్ తీసుకుని పోలీసులు నాంచారమ్మ ఇంటికి వచ్చి సోదా చేశారు.

"నా కొడుకు అలాంటోడు కాదు! అమాయకుడు. ఆడి కూతురి ఈడిని పేమించిందని, ఈ తాతబ్బాయే నాకొడుకిని సంపించేసి ఇలా,నాటకం ఆడుతున్నాడు.'' అంటూ ఏడుస్తూ తిరిగి కంప్లయింట్ చేసింది నాంచారమ్మ. రాయుడే డబ్బట్టుకుని పారిపోయి ఉంటాడని కొడుకు కోడలు అనే ఎత్తి పొడుపు మాటలు వినలేక కుమిలి కుమిలి ఏడ్చింది. ఆ బెంగ తోనే మంచాన పడి తీసుకుని తీసుకుని చనిపోయింది.

నీలవేణికి కాళ్ళు చేతులు ఆడడంలేదు.రాయుడు అలాంటి పని చేసాడంటే నమ్మలేదు. అలాగే ఈ లోకంలో లేడేమోనన్న వార్తని కూడా! `ఏమైపోయాడో నా రాయుడు` అంటూ విలపించింది. కొట్టు మూసేసింది. అన్నం తినడం మానేసింది. రాయుడి ఆలోచనలతో రాత్రుళ్లు నిద్రపోకపోవడం వల్ల కళ్ల క్రింద నల్ల చారలు వచ్చేశాయి. బెంగపెట్టుకునివడదెబ్బకి వడిలిపోయిన చామంతిలా అయిపోయింది.

"కాతంత ఎంగిలి పడక్కా!" అంటూ రామలక్ష్మి బ్రతిమలాడి ఆమె నోటిలో అన్నం పెట్టింది. కొన్ని రోజులు పోయాక నెమ్మదిగా కొట్టు తెరిచింది.

"ఎంత కాలం ఆడి కోసం ఎదురు సూత్తూ కూకుంటావు?ఈడు కాబోతే, మరోడు. నీకేం తక్కువని? కాతంత భూముంది,బోల్డు డబ్బుంది,అంతకు మించి మల్లె పూవు లాంటి మంచి మనసుంది" అంటూ ఆమె మనసు మళ్లించడానికి ప్రయత్నించింది.

"ఎంత మాటన్నావే లచ్చిమీ! ఓ పాలి రాయుడ్ని నా ఓడు అనుకున్నక మరో మగాడిని పెనిమిటిగా అనుకోలేనే !"అంటూ వెదురు బుట్టలో గులాబీ పూలకి అక్కడక్కడ అతుక్కుని ఉన్న ముళ్ళకొమ్మల్ని ఏరి బయటకు పారేసింది. రామలక్ష్మి ఆమె కేసి జాలిగా చూసి ఏమి మాట్లాడలేక వూరుకుంది.

రాయుడు ప్రాణాలతో తిరిగి వస్తే, భావనారాయణ స్వామికి బంగారు తోరణం చేయిస్తానని, అన్నవరం కాలి నడకన వెళ్లి వ్రతం చేయించుకుంటాని మొక్కుకుంది.

తాతబ్బాయి కూతురు పెళ్లి ఘనంగా చేసి సర్పవరం ఊరంతా భోజనాలు పెట్టాడు. నీలవేణి తప్ప రాయుడి అన్నావదిన లతో సహా ఊరిజనమంతా వెళ్ళి ఆహా! ఓహో! అనుకుంటూ తినొచ్చారు.

★★★★

కాలం నిర్దయగా రోజుల్ని వెనక్కి విసిరేస్తోంది.

సర్పవరం జంక్షన్లో నీలవేణి పూల కొట్టు సందడిగానే ఉంటోంది. రామలక్ష్మికి పెళ్లయి వెళ్లిపోయింది. నీలవేణి ప్రతిరోజూ సుబ్బరంగా ముస్తాబవుతుంది. ఉదయాన్నే వచ్చి కొట్లో కూచుంటుంది. పొద్దువాలే సమయానికి తిరిగి ఇల్లు చేరుకుంటుంది.

''వంగపువ్వు రంగు చీరలో ముచ్చటగా ఉన్నావే నీలవేణీ'' అని ఎవరైనా అంటే, 'రాయుడికి వంకాయ కూరంటే యిట్టం. వోణ్ని రానీ, లేత వంకాయలు తీసుకొచ్చి గుత్తివేసి కూర చేసి పెడతా' అంటుంది.

''నీ మొహాన వక్క రంగు స్టిక్కరు బిళ్ల బలేగుందే నీలవేణీ'' అంటే, ఈ బొట్టుబిళ్లదేముందిలే, నా తోటలో ఇదేరంగు రోజా మొక్క ఉండేది తెలుసాక్కా. ఈ రంగంటే రాయుడికి ఎంతిష్టమో. యాడనుంచో ఆ మొక్కని నాకోసం ప్రత్యేకంగా తెచ్చి తోటలో నాటాడు. యిప్పుడది సచ్చే పోయిందనుకో. ఆడొచ్చాక యింకో మొక్క తెప్పించుకుంటా'' అంటూ మురిసిపోతుంది.

''రోజూ యిన్నేసి పూలమ్ముతావు. నీ జడలో ఒక్క పువ్వయినా పెట్టేవేమే'' అని యెవరైనా చనువుగా అడుగుతారు. ''రాయుడు రావాల, ఈ జడలో మల్లెల మాల తురమాల'' అని తన్మయంగా చెబుతుంది.

బేరాలు లేని వేళల్లో  చెవిలో చిన్న ఫోను పట్టుకుని, ఏదో నాలుగు బటన్లు నొక్కి ''ఎప్పుడొస్తున్నావు రాయుడూ, ఎన్నాళ్లయిపోయింది? ఈ పాటికి మనకో బుడ్డది పుట్టుంటే బుడిబుడి అడుగుల్తో బడికెళ్తూ వుండేది తెల్సా '' అంటూ తనలో తనే నవ్వుకుంటూ ఏదేదో ముచ్చట్లు మాట్లాడుతూ ఉంటుంది.

ఏళ్లు గడిచిపోతున్నాయి. రాయుడిని జనం మర్చిపోయి చాలా కాలమైంది. నీలవేణి మాటల్లో రాయుడి పేరు విన్నప్పుడు, జనం రవంత ఆశ్చర్యంగా చూసి వెళ్లిపోతుంటారు. తోటలో పూల సేద్యం, కొట్టులో యాపారం అన్నీ సరిగానే చేస్తుంది గానీ  పూలవేణికి పిచ్చి పట్టిందని కొందరు అంటూ ఉంటారు.

అవును. నీలవేణికి పిచ్చే!

నిజాన్ని కూడా చూడలేనంత, వినలేనంత, అర్థం చేసుకోలేనంత, జీర్ణం చేసుకోలేనంత, నిరీక్షణలో జీవితాన్ని గడిపేసేంత  పొరలిపోయే ప్రేమను గురించి చెప్పడానికి ఇంకో పదం ఉందా భాషలో!

*************

# COMMENTS